www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 డిసెంబర్ 2023
5
కాకినాడ

కలెక్టరేట్‌లో అర్జీదారులకు లిఫ్ట్ సౌకర్యం

ప్రజాశక్తి-కాకినాడ

నిత్యం పరిపాలన అవసరాలు, వివిధ సమస్యల పరిష్కార నిమిత్తం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చే వృద్ధులు, వికలాంగుల కోసం రూ.23 లక్షల వ్యయంతో లిఫ్ట్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు.

లిఫ్టును ప్రారంభిస్తున్న కలెక్టర్

ఉత్తేజంగా...

- 2వ రోజు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ
- ఆకట్టుకున్న అతిథుల ప్రసంగాలు
- పలు తీర్మానాలకు ఆమోదం

కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ రెండోరోజైన గురువారం ఉత్తేజకరంగా సాగాయి. పలువురు ముఖ్యఅతిథుల ప్రసంగాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పోరాట స్ఫూర్తిని నింపాయి. అలాగే పలువురు సౌహార్ద సందేశాలు నూతనోత్సాహాన్ని ఇచ్చాయి. రెండోరోజు పలు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ రెండోరోజు రెట్టింపు ఉత్సాహంతో సాగింది. మొదటి రోజుకు కొనసాగింపుగా రెండోరోజు ఉదయం పలు జిల్లాల ప్రతినిధుల ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా జిల్లాల్లో చేపట్టిన ఉద్యమాలు, ఫలితాలను వివరించారు. ఈ సమయంలో వారు నిర్బంధానికి గురికావడం, జైలుపాలవ్వడం వంటి ఘటనలను ఉదహరించారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి చేసిన కార్యక్రమాలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడారు. తొలుత కష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. విద్యారంగంలో వినాశకర విధానాలు అమలవు తున్నాయన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకున్న తాను 1972-82 మధ్యకాలంలో ఎస్ఎఫ్ఐలో పనిచేసే అనేక సమస్యలపై పోరాడామన్నారు. గుంటూరులో అధ్యాపకునిగా వృత్తి నిర్వహించి మూడో సారి ఎంఎల్‌సిగా పనిచేస్తున్నామన్నారు. ఈ కాలంలో నిబద్ధత, నిజాయితీగా పనిచేస్తున్నానని ఇందుకు ఎస్ఎఫ్ఐ నేర్పిన విలువలే కారణమన్నారు. ప్రజా సమస్యల పట్ల, జీవితంలో విలువలతో ఎలా బతకాలో నేర్పిందన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుకదేవ్, సుభాష్ చంద్రబోస్, సుందరయ్య వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కషి చేస్తుందని కొనియాడారు. విద్యలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ బాగా పెరిగిందన్నారు. కొఠారి కమిషన్ ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని సూచించిందన్నారు. కాని నేడు అలా జరగట్లేదన్నారు. ఎన్ఇపిని వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో వినాశకర సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. పాఠశాలల మెర్జ్‌తో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. వైసిపి అధికారంలో ఒక్క డిఎస్‌సి కూడా తీయలేదన్నారు. యూనవర్శిటీల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎయిడెడ్ కళాశాలలను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నాశనం చేశాయన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ చేపట్టబోయే అన్ని ఉద్యమాలకు పిడిఎఫ్ గా తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని లక్ష్మణరావు ఈ సందర్భంగా తెలిపారు.

16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధుల హాజరు

మహాసభకు 16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 283 మంది ప్రతినిధులు అర్హత పత్రాల ఇచ్చారు. అందులో మండలాల నుంచి 103, టౌన్‌ల నుంచి 85, సీటీల నుంచి 63 మంది, జిల్లా కేంద్ర నుంచి 32 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభకు హాజరైన ప్రతినిధుల్లో అత్యధికంగా 15 నుంచి 18 ఏళ్ల వయస్సు వారు 101 మంది, 19 నుంచి 20 ఏళ్ల వయస్సు వారు 57 మంది, 23 ఏళ్ల లోపు వారు 75 మంది, 25 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు 41 మంది, 30 ఏళ్లకు పైగా ఉన్నవారు ముగ్గురు ఉన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన స్వేచ్ఛ(12 ఏళ్ళు) అత్యంత పిన్నవయస్కురాలు.

సమ్మెకు మద్దతుపై కృతజ్ఞతలు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ తీర్మానం చేసినందుకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని రోడ్డెక్కి అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. వేతనాలు పెంచడానికి డబ్బు లేదని చెబుతున్న పాలకులు, సలహాదారుల పేరుతో పెద్ద ఎత్తున సొమ్ములను దుర్వినియోగం చేయడం లేదా అని ప్రశ్నించారు. ఎన్ఇపి విద్యార్తులకే కాదు అంగన్‌వాడీలకు కూడా నష్టమేనన్నారు. ఎన్ఇపి కారణంగా అంగన్‌వాడీ సెంటర్లను విలీనం చేస్తున్నారన్నారు. ఎన్ఇపికి వ్యతిరేకంగా విద్యార్థులు, అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న పిఎన్ఎం కళారూపాలు

కాకినాడ జిల్లా పెద్దాపురం ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, అప్పన్న, రాంబాబు ఆధ్వర్యంలో ప్రదర్శించిన వివిధ కళారుపాలు ఆకట్టుకున్నాయి. 'ఎక్కడమ్మా నీవు లేనిది..ఏమిటి నీవు చేయలేనిది', 'నా చెమట చుక్కా నా చెమట చుక్కా' అంటూ పిల్లలు ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింపజేసింది. సుమారు గంట పాటు ప్రదర్శించిన "పల్లె సుద్దులు" ఉత్సాహంగా సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు పెంచి ప్రజలను ఎలా మోసాగిస్తున్నాయో, బిజెపి సర్కారు విద్యలో కాషాయీకరణను తీసుకొస్తూ విద్యా రంగాన్ని ప్రమాదంలో ముంచెత్తుతున్న విధానాన్ని వివరించారు. ఓటు హక్కు విలువను తెలియజేస్తూ పల్లె సుద్దులు చెప్పారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు అమృత, సమ్రత, పూజిత, అఖిల, నిఖిల, ధరణి, అరుణ్ బంగారు రాజు,గౌస్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పిఎన్ఎం కళాకారులు పల్లెసుద్దులు

నాయకులు సంఘీభావం

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

సిఎం వైఎస్.జగన్ జనవరి 3న కాకినాడ రానున్న సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు గురువారం పర్యవేక్షించారు. ఆర్ఎంసి గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా అక్కడ చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సిఎం పాల్గొనే బహిరంగ సభాస్థలి వద్ద చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆ ప్రాంతంలో కార్పొరేషన్ పరంగా చేపట్టాల్సిన పారిశుధ్యం, ఇతర పనులపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ పింఛన్ సొమ్మును 2,750 నుంచి రూ.3,000కు పెంపుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కాకినాడ నుంచి ప్రారంభిస్తారన్నారు. ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను సిఎం ప్రారంభిస్తారన్నారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్య కుమారి, డిసిపి హరిదాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, ఉద్యాన సహాయ సంచాలకులు టివి.శిరిల్, ఇఇ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

కుట్టు మిషన్ అందిస్తున్న సభ్యులు

శ్రీనిధి సేవా సంస్థ ఔదార్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తమకు తోచిన దాంట్లో అవసరాల్లో ఉన్న వారికి సాయం చేస్తున్నామని శ్రీనిధి సేవాసంస్థ సభ్యులు పేర్కొన్నారు. కాకినాడ మధురానగర్‌కు చెందిన శ్రీనిధి సేవా సంస్థ సభ్యులు గురువారం చిత్రాడ గ్రామానికి చెందిన ఒక మహిళకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్‌ను అందజేశారు. తామంతా గృహిణులుగా ఉంటూ తమ ఇంటి అవసరాలకు ఉపయోగించే డబ్బులో కొంత భాగాన్ని పొదుపు చేసి అవసరాల్లో ఉన్న వారికి సాయం చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు. ఒక మహిళకు వినికిడి యంత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణ, శ్యామల, ఈశ్వరి, వాణి, ఇందిర, విజయలక్ష్మి, రాజేశ్వరి, స్వప్న, రాణి పాల్గొన్నారు.

9వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కాకినాడ

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు 9వ రోజు సమ్మె శిబిరంలో వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. సమ్మె శిబిరానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు హాజరై మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎవరి ప్రమేయం లేకుండానే కడుపుకాలి సమ్మె పోరాటంలోకి వచ్చారని, జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే సమ్మె చేయాల్సి వచ్చిందని చెప్పారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా పార్ట్ టైం, డైలీ వేజ్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పేర్లతో రాష్ట్ర ప్రభుత్వమే సమగ్ర శిక్ష ఉద్యోగులను శ్రమదోపిడీ చేస్తుంటే పోరాడక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 70 శాతం అక్షరాస్యత సాధించడంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల పాత్ర కీలకమైందని, తక్షణం సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ బేష రతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించి సమ్మెకు మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్సులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, పోలాత్తుల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణ, రొంగల వీర్రాజు, జుత్తుగ శ్రీను, విజయ్ కుమార్, ఎం.చంటిబాబు, సత్య నాగమణి, జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు పివివి మహాలక్ష్మి, ఎ.లోవరాజు, సహాయ కార్యదర్శులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్, రాధాకృష్ణ నాయకత్వం వహించారు.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న నరసింగరావు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఎపి బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌డిఒ జె.సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి నాలుగేళ్లయిందన్నారు. దీంతో సంక్షేమ బోర్డు నుంచి భవన నిర్మాణ కార్మికులకు అందే అన్ని సంక్షేమ పథకాల ఫలాలు ఆగిపోయాయన్నారు. భవన నిర్మాణ రంగంలోని అన్ని విభాగాల కార్మికులకు దక్కాల్సిన సంక్షేమ ఫలాల నిధులు ఇతర కార్యకలాపాలకు మళ్లించడం దారుణమన్నారు. ప్రజా సంక్షేమమే తన లక్ష్యం అని చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలపై ఏమాత్రం గౌరవమున్నా సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, తైనాల శ్రీను, వడ్డి సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, గూనూరి వెంకటరమణ, ఎన్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఆదిత్య ప్రొఫెసర్ మూర్తికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సిహెచ్ఎస్‌వివిఎస్ఎన్.మూర్తి జెఎన్‌టియుకె నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. గుంటూరు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పి.సారధి వర్మ నేతృత్వంలో మూర్తి సమర్పించిన ఎవల్యూషన్ ఆఫ్ కంటెంట్ బేస్డ్ కోలాబోరేటివ్ ఫిల్టరింగ్ ఫర్ రికమండర్ సిస్టమ్స్ యూజింగ్ క్లస్టరింగ్ విత్ హైబ్రీడ్ సిఎన్ఎన్ మోడల్స్‌పై సమర్పించిన సిద్ధాంతానికి ఈ డాక్టరేట్ లభించినట్టు తెలిపారు. మూర్తిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డోలా సంజయ్, డీన్ డాక్టర్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ ఎం.అనిల్ కుమార్ అభినందించారు.

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాజులూరు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి నర్ల ఈశ్వరి డిమాండ్ చేశారు. గురువారం కాజులూరు వేగుళ్లమ్మ ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి వచ్చాక పాదయాత్రలో మిడ్డే మీల్స్ వర్కర్లకు రూ.10 వేల జీతం ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాజబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఐదో సంవత్సరం జరుగుతున్నా సమస్యలు పరిష్కరించలేదన్నారు. సమస్యలపై జనవరిలో విజయవాడలో చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా తాళ్లపూడి రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా యాళ్ల అరుణ, సహాయ కార్యదర్శిగా ముద్రగడ విజయలక్ష్మి, పి.శేషారత్నం, కట్టా సత్యవేణి, నేరేడుమిల్లి సుబ్బలక్ష్మి, తిరగట్టి సత్యవతి, పులుగు కుంతీదేవి, కామేశ్వరి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వర్కర్లు

గండేపల్లి ఎస్ఐగా రామకృష్ణ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి ఎస్ఐగా ఎన్.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గండేపల్లిలో పని చేస్తున్న ఎస్ఐ యర్రంశెట్టి గణేష్ కుమార్ కాకినాడ బదిలీ అయ్యారు. ఎస్ఐ రామకృష్ణను ఎఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్ఐ రామకృష్ణ

కరప ఎస్ఐగా టి.రామకృష్ణ

ప్రజాశక్తి -కరప

కరప ఎస్ఐగా టి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్టూ'నిజం'

నిరసన తెలుపుతున్న శానిటేషన్ వర్కర్లు

మోకాళ్లపై నుంచుని శానిటేషన్ వర్కర్ల నిరసన

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం)

సమస్యలు పరిష్కరించాలని నగర పంచాయతీ శానిటేషన్ వర్కర్లు చేస్తున్న సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం వద్ద శానిటేషన్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని మోకాళ్లపై నుంచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పండగ సెలవులు అమలు చేయాలన్నారు. ఈ సమ్మెకు సిఐటియు నాయకులు కె.విశ్వనాథం, కుంచే చిన్న, అంగన్వాడి వర్కర్స్ నాయకులు బి.తులసీదేవి, అమల, యుటిఎఫ్ నాయకులు సీతరామరాజు, పద్మనాభం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ నాయకులు నీలాపు యేసమ్మ, సిహెచ్‌వి.రమణ, పోలమ్మ, సత్తిబాబు, రామారావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్‌తో మాట్లాడుతున్న ఎస్‌పి

కోట పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-కోటనందూరు

జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ గురువారం కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పోలీసులు పనితీరు, మహిళా పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలను తెలియజేశారు. ఆయన వెంట డిఎస్‌పి ఎ.లతాకుమారి, తుని రూరల్ సిఐ సన్యాసిరావు, ఎస్ఐ బి.శంకర్రావు పాల్గొన్నారు.

చెవిలో పూలతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం, తుని

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 3వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకోవాలని చెప్పిన ముఖ్యమంత్రి వారి వేతనాలు పెంపుదలకు, వారి ఉద్యోగ భద్రత కోసం ఎందుకు మాట్లాడటం లేదన్నాని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, యూనియన్ నేతలు శివకోటి అప్పారావు, వర్రే గిరిబాబు, ఇసరపు దుర్గాప్రసాద్, సింగంపల్లి సింహాచలం, ముత్యాల దుర్గ, వర్రే భవాని, దొండపాటి శేషారావు, మడికి మోహన్ రావు, యాసలపు శ్రీకాంత్, వర్రె రాజేష్, కెవి.రమణ, బాసిన భద్రరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తునిలో పారిశుధ్య కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. సిఐటియు మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. గొల్ల అప్పారావు సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అప్పారావు, కిషోర్, నూకరాజు, చిట్టిబాబు, శాంతకుమారి, ప్రభావతి పాల్గొన్నారు.

పెద్దాపురంలో మున్సిపల్ కార్మికుల సమ్మె

నేరాలు ఘోరాలు

సారా కేసులో రూ.25 వేల జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సారాయి కేసులో ముద్దాయి నుండి రూ.25 వేలు జరిమానా వసూలు చేసి గురువారం ప్రభుత్వానికి జమ చేసినట్లు కాకినాడ నార్త్ స్టేషన్ ఎస్ఇబి ఇన్స్‌పెక్టర్ కె.రామమోహనరావు తెలిపారు. మాధవపట్నం గ్రామానికి చెందిన నురుకుర్తి వెంకటలక్ష్మి పలుమార్లు సారాతో పట్టుబడగా ఆమెను తహశీల్దారు ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఆయన ఆదేశాలతో ఆమె నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేసినట్లు వివరించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు దళిత కాలనీలో నత్తల మేరీకి చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకష్ణాజీ, వైస్ ఎంపిపి కొరుప్రోలు కృష్ణ, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి దొరబాబు బాధితురాలిని పరామర్శించి బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

పంట నమోదుపై ఇకెవైసి చేయాలి

ప్రజాశక్తి-పిఠాపురం

వరినాట్లు పూర్తయిన రైతుల పంటను నమోదు చేసి ఇకెవైసి పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన రాపర్తి గ్రామాన్ని సందర్శించారు. వరి వెదజల్లు పద్ధతిని, నాట్ల పురోగతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా నారుమళ్ళు వెయ్యొద్దన్నారు. మిగిలిపోయిన రైతులు వెదజల్లే పద్ధతి ద్వారానే వేసుకోవాలని సూచించారు. దమ్ము చేయవలసిన రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలని చెప్పారు. డిసెంబర్ నెలాఖరు నాటికి అందరూ పూర్తిస్థాయిలో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎడిఎ పి.స్వాతి, ఎఒ అచ్యుతరావు, విఎఎ పి.సుధారాణి పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. స్థానిక నామన వెంకాయమ్మ జెడ్‌పి హైస్కూల్లో హెచ్ఎం కిషోర్ అధ్యక్షతన గురువారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 120 మంది విద్యార్థులకు ఈ ట్యాబ్‌లు అందజేశారు. జెడ్‌పిటిసి సామ్యూల్ సాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రెడ్డి బాబు, స్కూల్ కమిటీ చైర్మన్ మట్టపర్తి శ్రీను, చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీదేవి, కుడుపూడి మల్లేష్, ఉపాధ్యాయులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 31న నిర్వహించనున్న పశుసంవర్ధక శాఖ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. టిసిఎస్. ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ ఆన్‌లైన్ పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరు కానున్నారరని తెలిపారు. తాను సూపరింటెండెంట్‌గా పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారని టిసిఎస్ కో ఆర్డినేటర్ ఎం.రాజబాబు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఆర్‌డిఒ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహశీల్దారు కెవివి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణ కాలనీలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కోటనందూరు

తునిలోని రామకృష్ణ కాలనీలో గురువారం టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకూ ప్రచారం నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టిడిపి మ్యానిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తే అభివద్ధి, సంక్షేమ పాలన అందిస్తారని అన్నారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, పోలినాటి శేషగిరి, మోటుకూరి వెంకటేష్, ఇనిగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్యం రహిత వేడుకలు అవసరం

ప్రజాశక్తి-పిఠాపురం

మద్యం, మాదకద్రవ్యాలు లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు పిలుపు ఇచ్చారు. గురువారం మండలంలోని వెల్దుర్తిలో నూతన సంవత్సర వేడుకలను మద్యం, మాదకద్రవ్యాలతో కాక పూల మొక్కలు, స్వీట్లు పంచి స్వాగతం పలకాలని ర్యాలీ చేపట్టినట్టు చెప్పారు. మద్యం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. మద్యపానం వల్ల అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని చెప్పారు. యువత, విద్యార్థులు మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు వేమగిరి తలుపులయ్య, చంటి, రాజు, కుమారి,నూకాలమ్మ పాల్గొన్నారు.

ఉప్పునీటి పాయ ఆక్రమణ ఆపాలి

తాళ్లరేవు : చొల్లంగి గ్రామంలో పొలాలను ఆనుకుని ఉన్న 70 ఎకరాల ఆక్వా చెరువులు, 150 ఎకరాల వ్యవసాయ భూమికి చెందిన ఉప్పునీటిపాయను కొందరు పెత్తందారులు ఆక్రమించుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాన సూర్యనారాయణ, స్వర్ణ వీరబాబు, శ్రీరామచంద్రమూర్తి గురువారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ భూముల నుంచరి నీరు దింపేందుకు ఆక్వా చెరువులకు నీరు తోడుకునేందుకు ఈ ఉప్పునీటిపాయే తమకు దిక్కు అన్నారు. అటువంటి పాయను కొందరు పెత్తందారులు, రాజకీయ నాయకుల అండదండలతో పూర్తిగా కాలవను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సానా అప్పారావు, స్వర్ణ వీరబాబు, కందుల వెంకన్న, పప్పు రాంబాబు, ఎస్‌వివిఎస్ఎన్.మూర్తి, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా...

తీర్మానాలకు ఆమోదం తెలుపుతూ...

కాకినాడలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ ఉత్సాహంగా సాగుతోంది. ప్రజానాట్య మండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు విద్యార్థులు సైతం ఉత్సాహంగా అభ్యుదయ గీతాలను ఆలపించారు. పలు నృత్యరూపకాలు ఆలోచింపజేశాయి.

కళాకారులు నృత్యరూపకం

డప్పు కళాకారుల ప్రదర్శన

గీతాలాపన

జెఎన్‌టియుకె విసికి జ్ఞాపికను అందిస్తూ...

పోరాటాలు... విజయాలు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పలు పోరాటాలు చేసింది. సామాజిక బాధ్యతగా ప్రజా సమస్యలపైనాస్పందించింది. రాష్ట్ర మహాసభలకు వచ్చిన పలువురు ప్రతినిధులు ఆయా జిల్లాల్లో జరిగిన పోరాటాలు, విజయాలు, ఎదుర్కొన్న నిర్బంధాలను ప్రజాశక్తితో పంచుకున్నారు. వాటిలో కొన్ని....

• నిర్బంధాన్ని ఎదుర్కొన్నా..

సంక్షేమ వసతిగృహాల్లో మెస్‌ఛార్జీలు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కుక్, కమాటీ, వాచ్‌మ్యాన్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో 2023లో చలో కలెక్టరేట్‌ను నిర్వహించాం. ఈ సందర్భంగా పోలీసులు నన్ను లక్ష్యంగా చేసి లాఠీఛార్జి చేయడానికి ప్రయత్నం చేశారు. మెన్ ఎస్ఐ బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. జీపులో ఎక్కించి దాడి చేశారు. అప్పట్లో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. అక్రమ అరెస్టులపై, అణచివేత చర్యలను నిరసిస్తూ పోలీసులు తీరుపై ఆందోళన చేశాం. చివరకు జిల్లాలో ఉన్న అన్ని హాస్టళ్ల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నాయకులతో చర్చించి 167 సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగానే ఇవి పరిష్కారం అయ్యాయి. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తాం.

- ఎం.సౌమ్య,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు, విజయనగరం జిల్లా

• జాబ్ క్యాలెండర్ పోరాటంలో లాకప్‌లో పెట్టారు

2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10 వేల పోస్టులతో జాబు క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఖాళీ పోస్టులు లక్షల్లో ఉండగా అరకొర ఉద్యోగాలు భర్తీ కోసం మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో నిరుద్యోగులంతా స్వచ్ఛందంగా ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐగా వారికి మద్దతు తెలిపాయి. కలెక్టరేట్ వద్ద 3గంటల పాటు ధర్నా నిర్వహించాం. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశాం. గేట్లు తోసుకుంటూ వెళ్లి ఆందోళన ఉధృతం చేశాం. అయినా అధికారులు స్పందించలేదు. మరుసటి రోజు ఎంఎల్ఎకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్తుంటే దౌర్జన్యంగా పోలీసులు మమ్మల్ని అందరినీ ఈడ్చుకుని వెళ్లి అక్రమంగా అరెస్ట్ చేసి లాకప్ లో పెట్టారు. నిర్బంధాన్ని నిరసిస్తూ రెండో రోజు రాస్తారోకో ద్వారా పోలీసులు తీరును నిరసిస్తూ ఆందోళన చేశాం.

- అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

• ఎయిడెడ్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాం

2021-22లో భీమవరం డిఎన్ఆర్ ఎయిడెడ్ కళాశాల, నరసాపురం వైఎన్ ఎయిడెడ్ కళాశాలలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద పోరాటం తలపెట్టాం. దీంతో పోలీసులు విద్యార్థి సంఘం నాయకులతోపాటు 47 మంది విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయించారు. ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేశారు. అయినా వెనక్కి తగ్గకుండా ఉద్యమాన్ని సాగించాం. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఎయిడెడ్‌ను ప్రయివేటుపరం చేయడాన్ని నిలిపేసింది. అలాగే పెనుగొండ ఎస్‌వికెపి డిగ్రీ కాలేజీలో ఓ విద్యార్థి ఎన్‌సిసి శిక్షణకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. క్యాంపు నిర్వహకుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందడంతో ఎస్ఎఫ్ఐగా విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనలు చేపట్టాం. పోరాటం ఫలితంగా చివరకు మరణించిన విద్యార్థి కుటుంబానికి అధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

-టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, పశ్చిమగోదావరి

• హాస్టల్ భవనాల కోసం పోరాటం

2007లో ఏర్పడిన కృష్ణా యూనివర్సిటీ 2019 వరకు అద్దె భవనంలో నిర్వహించారు. సుమారు 5 వేలు మంది విద్యార్థులున్న ఈ యూనివర్సిటీకి 2019-20 మధ్యకాలంలో సొంత భవనాలను నిర్మించారు. అయితే వసతిగృహాలు నిర్మాణం చేపట్టలేదు. దాంతో ఎస్ఎఫ్ఐగా అనేక ఉద్యమాలు చేశాం. 2023 ఫిబ్రవరిలో ఎంసిఎ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇద్దరు మహిళా విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనంలో ఉండడం వల్ల కరెంటు షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. వారికి న్యాయం జరిగే వరకూ ఎస్ఎఫ్ఐ పోరాడింది. చలో యూనివర్సిటీ కార్యక్రమం ద్వారా అధికారులను కదిలించాం. చివరకు స్పందించిన యంత్రాంగం చర్చలకు పిలిచింది. అప్పటి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ సహా మిగిలిన నాయకులను పోలీసులతో విచక్షణారహితంగా దాడి చేయించారు. క్రూరంగా ప్రవర్తించారు. అయినా పోరాటాలను ఆపలేదు. చివరకు యూనివర్సిటీ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం మూడు నెలల క్రితం శంకుస్థాపన చేసింది. త్వరలో నిర్మాణ పనులు కూడా పూర్తయే అవకాశం ఉంది.

- సిహెచ్.రాజేష్, కృష్ణా యూనివర్సిటీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

• నాలుగు రోజుల పాటు నిరవధిక దీక్ష

వసతిగృహాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నాతో పాటు మరో ఏడుగురు నాలుగు రోజులు పాటు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టాం. రెండవ రోజు పోలీసులు దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. అక్రమంగా అరెస్టు చేసేందుకు అర్ధరాత్రి వచ్చారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. నాలుగు రోజుల దీక్షలు నేపథ్యంలో నిరసనలో ఉన్న వారి ఆరోగ్యాలు బాగా క్షీణించాయి. అయినా యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున విద్యార్థులతో చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చాం. ఆ కార్యక్రమాన్ని నిలుపుదల చేయించిన అధికారులు ఎస్ఎఫ్ఐ నాయకులను దీక్షలు విరమింపజేసి చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చారు. మా పోరాటం ఫలించింది.

- సామంతుల సమీర, ప్రొఫెషనల్ స్టూడెంట్స్ నెట్ వర్క్ కన్వీనర్, విజయనగరం జిల్లా

అంగన్‌వాడీల పోస్ట్‌కార్డు ఉద్యమం

అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో పోస్ట్ కార్డులు రాసి తమ సమస్యలను సిఎం జగన్‌కు పంపించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సమ్మె శిబిరంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింహారావు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడారు. మంత్రులు చర్చల్లో కూర్చుని ఆర్థికపరమైన డిమాండ్లు నెరవేర్చలేమని చెప్పడం దారుణమన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఎంఎల్ఎలు, మంత్రులు స్థానికంగా ఎలా తిరుగుతారో చూస్తామని హెచ్చరించారు. సెంటర్ల తాళాలు పగలగొట్టి నిర్వహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఒక్క పిల్లవాడిని కూడా సెంటర్‌కు తీసుకువచ్చి కూర్చోబెట్టిన దాఖలాలు లేవన్నారు. సమ్మెకు వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు జి.కొండలరావు, సిహెచ్.సుబ్బారావు, ఎస్‌కె.కరీముల్లా, పి.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, కోశాధికారి దువ్వా శేష బాబ్జి, చెక్కల రాజకుమార్, మలక వెంకటరమణ, జి.రమణమ్మ, నీరజ, రమ, మున్ని, విజయ, సరోజ, సత్యవేణి, జోగాంబ, దీప్తి, అప్పలకొండ, శ్రీదేవి, వేణు పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్‌లో శిబిరం వద్ద పోస్ట్ కార్డులు రాశారు. దాడి బేబీ, టిఎల్.పద్మావతి, సావిత్రి, స్నేహ, కాలే దేవి, నెహ్రూ కుమారి, చంటమ్మ, నాగమణి, లోవతల్లి, వసంత, తులసి, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు. **పెదపూడి** సిఐటియు నాయకులు రాజేశ్వరి, ఎస్.కనకదుర్గ, వి.భారతి, బాంధవి, ఎస్.చాందిని, ఎ.శాంతరత్నం, మేరీ రత్నం, నాగేంద్రమణి, అరుణ పాల్గొన్నారు. **కిర్లంపూడి** తహశీల్దార్ కార్యాలయ సమీపంలో రిలే దీక్ష నిర్వహించారు. రత్నం, పి.సావిత్రి, షేక్ పర్వీన్, జి.రత్నం, పి.మంగాయమ్మ, పి.ప్రభావతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** రత్నం, సుజాత, ఆధ్వర్యాన కార్డులు పంపించారు. **యు.కొత్తపల్లి** తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, పోస్ట్ కార్డులు పంపారు. వి.రామలక్ష్మి ఒ.సత్యవతి, జి.బేబీరాణి, డి.అన్నపూర్ణ, ఐ.హేమలత పాల్గొన్నారు. వీరికి కెవివి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, సిహెచ్.సాంబశివకుమార్, సిహెచ్.పద్మాకర్‌రావు మద్దతు తెలిపారు. **పిఠాపురం** తహశీల్దార్ కార్యాలయం వద్ద శిబిరంలో డి.తులసి, నళిని, ప్రజావాణి, విజయశాంత పాల్గొన్నారు. నియోజకవర్గంలోని గొల్లప్రోలులో సమ్మెకు ప్రజా సంఘాల నాయకులు బి.పద్మనాభం, సీతారామరాజు, సిహెచ్.ఉమా, కుంచే చిన్న, కరణం విశ్వనాథం మద్దతు తెలిపారు. వి.వెంకటలక్ష్మి, అమల, వీరరాఘవ, ఎం.వెంకటలక్ష్మి, సూర్యావతి, రామతులసి పాల్గొన్నారు. **కరప** పి.వీరవేణి, ఎస్.వరలక్ష్మి, ఎస్ఎస్.కుమారి, దైవ కుమారి, ఆశారత్నం, కల్పలత, సత్యమాధవి, ఎం.భవాని, నారాయణమ్మ, మంగతాయారు, సరోజిని, జ్యోతి, కల్పలత, పి.లక్ష్మి, ఎ.దేవి, బి.మనోజ, లక్ష్మి, సాయి దుర్గ, బి.భవాని పాల్గొన్నారు. **తాళ్లరేవు** సిఎం జగన్‌కు 172 ఉత్తరాలు రాసి పోస్ట్ బాక్స్‌లో వేశారు. **సామర్లకోట రూరల్** తహశీల్దారు కార్యాలయం వద్ద అర్బన్, రూరల్ సెక్టార్ల పరిధిలో టి.నాగమణి అధ్వర్యంలో 350 మంది పోస్టు కార్డులు పంపారు. తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. వి.అమలావతి, వి.ఎస్తేరురాణి, మహాలక్ష్మి, మంగాలక్ష్మి, ఎస్‌కె.ఫాతిమా, ఎ.వాణీదేవి పాల్గొన్నారు. **కోటనందూరు** దడాల పద్మ అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. నాయకులు సమాధానం, ధనలక్ష్మి, సుబ్బలక్ష్మ, లోవరత్నం, ఇందిర, లలిత, షకీలాభాను పాల్గొన్నారు.

కాకినాడలో మాట్లాడుతున్న బేబిరాణి

బచ్చు ఫౌండేషన్ సేవలు విస్తృతం

పెద్దాపురం : పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోనే కాక అనేక గ్రామాల్లో విశేష సేవలందిస్తున్న బచ్చు ఫౌండేషన్ సంస్థ సేవలను మరింత విస్తతం చేయనున్నట్టు బచ్చు ఫౌండేషన్ చైర్మన్ బచ్చు అవినాష్ దేవీచంద్ర అన్నారు. బచ్చు ఫౌండేషన్ నూతన కమిటీ ఎంపిక గురువారం నిర్వహించారు. అధ్యక్షులుగా ఎం.వరలక్ష్మి, ట్రస్టీ సభ్యులుగా కె.లక్ష్మీ తాయారు, జి.సత్తిబాబు, ఎ.శ్రీను, జె.కిషోర్, జి.వీరాస్వామి ఎంపికయ్యారు. గురువారం స్థానిక బచ్చు ఫౌండేషన్ అసెంబ్లీ హాల్లో వీరి ప్రమాణ స్వీకార సభలో అవినాష్ దేవి చంద్ర మాట్లాడారు. బచ్చు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం వార్షికోత్సవం

తాళ్లరేవు : రిలయన్స్ అధినేత ధీరూబాయి అంబాని ఎర్లీ ఇంటర్వెన్షన్ స్కూల్ 14వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ధీరుబాయి అంబానీ చిత్రపటానికి రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి ఎంపిడిఒ అనుపమ మాట్లాడారు. వికలాంగులకు సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమా మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, కేంద్రం ఇన్‌ఛార్జి ఎంజె.గోపాలరావు, స్టీఫెన్, నవ్య, నాగమణి, వీరవేణి, శ్రీకాంత్, సత్తిబాబు పాల్గొన్నారు.

క్లాస్-4 ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

పెద్దాపురం : పెద్దాపురం డివిజన్ క్లాస్-4 ఎంప్లాయీస్ యూనియన్ నూతన అధ్యక్షునిగా ఎం.విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం జిల్లా క్లాస్-4 ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అడ్‌హాక్ కమిటీ చైర్మన్ సవరపు చినపాపారావు అధ్యక్షతన జరిగిన డివిజనల్ స్థాయి సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంవివి.భాను కుమార్, కొప్పిశెట్టి కృష్ణ, ఖండవిల్లి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో అధిక రాబడి

రౌతులపూడి : చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి పొందొచ్చని అసోసియేట్ డైరెక్టర్ రిసార్ఛ్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు గురువారం రౌతులపూడిలో ఎంపిడిఒ కార్యాలయంలో చిరుధాన్యాలు, యాజమాన్య విలువలు జోడింపు అనే అంశంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెద్దాపురం వ్యవసాయ పరిశోధన సంస్థ మునిరత్నం మాట్లాడారు. చిరు ధాన్యాల సాగు కోసం వివరించారు.

గ్రామాల అభివృద్ధి టిడిపితో సాధ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమైందని వైసిపి పాలనలో అన్ని వర్గాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి చెప్పారు. గురువారం చంద్రన్నకు అండగా నిలవాలి కార్యక్రమం కాకినాడ రూరల్ మండల పరిధిలోని రాయుడుపాలెం, తూరంగి గ్రామాల్లో నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో తప్పకుండా టిడిపి, జనసేనకు మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు విసుగెత్తి ఉన్నారని, ప్రజలే త్వరలో ఓట్ల రూపంలో బుద్ధి చెబుతారని చెఆప్పరు. ఈ కార్యక్రమంలో గుల్లిపల్లి శ్రీనివాసరావు, మిరపల సూర్య ప్రకాష్, జక్కే అప్పన్న, యాసలపు కన్నబాబు, గురి గణేష్‌కుమార్, శర్మ, పెమ్మాడి శ్రీనివాస్, జామి సత్తిరాజు, యాళ్ల రాజా, దొమ్మేటి వెంకట రమణ, బొజ్జ భవాని సాంబశివరావు, పలివెల గాయత్రి, కాళ్ల శ్రీను, పడమటి వీరబాబు, పిల్లి రామకష్ణ, కేశబోయిన ఏడుకొండలు, కొల్లుబోయిన అచ్యుత్ పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు వైసిపికి లేదు'

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు వైసిపికి లేదని టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని ఇర్రిపాకలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాడుకుని వదిలేయడం సిఎం వైఎస్.జగన్ తన సొంత ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిపెడతారని చెప్పారు. చెప్పేదొకటి చేసేదొకటి విశ్వసనీయత లేని వ్యక్తి జగన్ రెడ్డి అన్నారు. అధికారంలో రాకముందు ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేస్తానని మోసం చేశారని, రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చి సంపదంతా దోచుకుంటూ తన తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకుంటున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, మండపాక అప్పన్న దొర, జ్యోతుల సత్యమూర్తి, మురా సత్తిబాబు, జ్యోతుల వీరభద్రరావు, గొట్టుముక్కల రఘురామరాజు పాల్గొన్నారు.

లింక్ దస్తావేజు పోయినది

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వర రావు, డోరునెం.1-21 ఉసులు మర్రు గ్రామం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివశిస్తున్న నా యొక్క **1558/2004 తేది.7-5-2004** నెంబర్లు గల లింక్ దస్తావేజు ది.**20-12-2023**వ తేదీన నేను ఇల్లు మార్చుకొన్న సందర్భంలో ఉసులు మర్రు మార్గం మధ్యలో పడిపోయినది. ఎంతవెతికినా కనిపించ లేదు. కనుక పై నెంబరు గల లింక్ దస్తావేజు ఏవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయ వలసిందిగా కోరుచున్నాను.

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వరరావు
డోరునెం.1-21, ఉసులుమర్రు గ్రామం,
తూర్పుగోదావరి జిల్లా. సెల్: 9154634219

సామర్లకోట పురపాలక సంఘం

ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఒ.సి. నెం. 557/2023-ఇ1 తేది.28-12-2023

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘ నిధులు (2020-21), జిజిఎమ్‌పి నిధులు మరియు జనరల్ నిధులతో ఎస్టిమేట్ కాంట్రాక్టు విలువ రూ. 33.26 లక్షలుతో 10 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది : ది. 29-12-2023 ఉదయం గం॥ 10.30ల నుండి
2. టెండర్లు స్వీకరణకు ముగింపు తేది : ది.05-01-2024 సాయంత్రం గం॥ 5.00ల వరకు

తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in నందు 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చు.

సం/- **కమిషనరు**
సామర్లకోట పురపాలక సంఘం